క్లుప్తంగా

అప్పన్న సన్నిధిలో ఎస్‌బీఐ చైర్మన్



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న ఎస్‌బీఐ చైర్మన్ దినేష్‌కుమార్ దంపతులు

సింహాచలం: వరాహ లక్ష్మీ నృసింహస్వామిని బుధవారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చైర్మన్ దినేష్‌కుమార్ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అంతరాలయంలో స్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అనంతరం ఆలయ సూపరింటిండెంట్ సునీల్ స్వామి వారి ప్రసాదాన్ని ఆయనకు అందజేశారు.

కాపు సంక్షేమ భవనంలో వసతులు కల్పించాలి



చేయాల్సిన పనులను ఎండీ కృష్ణమూర్తికి వివరిస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

సింహాచలం: జీవీఎంసీ 95వవార్డు పరిధి చీమలాపల్లిలోని శ్రీకృష్ణదేవరాయ కాపు సంక్షేమ భవనాన్ని బుధవారం కాపు కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణమూర్తి పరిశీలించారు. భవనంపై అదనపు అంతస్తు, వంటశాల నిర్మాణానికి నిధులు కేటాయించాలని కార్పొరేటర్ ముమ్మన దేముడు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో నక్క నకరాజు, ఆకుల గుణాకర్, తామర్ల నర్సింగ్, గంట్ల నర్సింహమూర్తి, అప్పికొండ రాంబాబు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ



మొక్కలు అందజేస్తున్న వెంకటరావు

సబ్బవరం: గ్రేస్ ఆఫ్ గాడ్ ట్రస్టు సేవలు అభినందనీయమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు అన్నారు. మండలంలోని అంతకాపల్లి గ్రామంలో పచ్చదనం-కాలుష్యనివారణ-ఆరోగ్యం అనే కార్యక్రమంలో భాగంగా బుధవారం చేపట్టిన మొక్కల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ట్రస్టు ద్వారా చుట్టు పక్కల గ్రామాలతో పాటు మన్యం ప్రాంతంలో సైతం అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్న ట్రస్టు చైర్మెన్ విజయకుమార్‌ను అభినందించారు. అలాగే హత్తుకునే చేతులు కార్యక్రమంలో భాగంగా 30 మందికి నిత్యావసర సరకులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, ట్రస్టు చైర్మన్ విజయ కుమార్,ఉప సర్పంచ్ గొర్లి అప్పారావు, మాజీ సర్పంచ్ సబ్బవరపు దేముడు బాబు,వార్డు మెంబర్ ఒమ్మి కోటి తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని గ్యాస్ లారీల డ్రైవర్ల ఆందోళన



ఐవోసీ వద్ద ఆందోళన చేస్తున్న గ్యాస్ లారీడ్రైవర్లు

పరవాడ: తమకు వేతనాలు పెంచాలని ఐవోసీ గ్యాస్ లారీల డ్రైవర్లు బుధవారం ఐవోసీ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ గ్యాస్ లారీ డ్రైవర్లు, కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయడంతో పాటు హెల్త్ కార్డులు రెన్యువల్ చేయాలని కోరారు. డ్రైవర్ల సమస్యలను పరిష్కరించడానికి యాజమాన్యం తక్షణమే చర్యలు చేపట్టాలని యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్.సూరిబాబు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, దేముడు, తాతారావు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం

- పార్టీలు చూడకుండా పథకాలు అందించిన ఘనత ఆయనదే
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- అడవివరంలో ఉత్సాహంగా గడప గడపకు..



ఎస్సీ కాలనీలో మహిళలకు ప్రభుత్వ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సింహాచలం: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. కోటి 25లక్షల కుటుంబాలకు రెండు లక్షల కోట్ల రూపాయిలు సంక్షేమ పథకాల ద్వారా అందించడం దేశచరిత్రలోనే చాలా గొప్ప విషయమన్నారు. భీమిలి నియోజకర్గం పరిధి అడవివరం ఎస్సీకాలనీ, కాపుదిబ్బ ఏరియాల్లో బుధవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లగా అందించిన సంక్షేమ పథకాలను, చేసిన అభివృద్ధిని వివరించారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి మాట్లాడుతూ జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందన్నారు. పార్టీలు, కుల మతాలు చూడకుండాఅర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించి జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారన్నారు. 529 సచివాలయం పరిధిలోనే సుమారు రూ.9 కోట్లు సంక్షేమ పథకాల ద్వారా అందించామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు ఉండడం వల్లే కరోనా కష్ట కాలంలో కూడా ప్రజల బాగోగులు చూసే అవకాశం లభించిందని చెప్పారు. ఇంటి వద్దే ఒకటో తేదీన పింఛన్ల అందించి ప్రభుత్వ కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరిగే పని లేకుండా చేశారన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ 8వ జోన్ కమిషనర్ మల్లయ్యానాయుడు, గోపాలపట్నం సీఐ నరసింహరావు, వైఎస్సార్‌సీపీ 98వవార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, 98వ వార్డు ఇన్‌చార్జి ఎర్ర వరహా నరసింహం, పార్టీ నాయకులు లంక సత్తిబాబు, ఎస్.కృష్ణ, బొట్టా శ్రీను, మధురెడ్డి, తెల్లపు మహేష్ పాల్గొన్నారు.

కమ్యూనిటీహాలు మరమ్మతులకు నిధులు

ఎస్సీకాలనీలోని కమ్యూనిటీ హాల్ అదనపు అంతస్తు మరమ్మతులకు రూ.4 లక్షలు నిధులు మంజూరు చేయనున్నట్టు ముత్తంశెట్టి తెలిపారు. కమ్యూనిటీ హాల్ ఫ్లోరింగ్ లేదని, శిథిలావస్థలోఉందని స్థానికులు ముత్తం దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన పరిశీలించారు. గడప గడపకు మన ప్రభుత్వం నిధుల నుంచి నాలుగు లక్షలు కమ్యూనిటీ భవనం పై అంతస్తు మరమ్మతులకు వినియోగించాలని జీవీఎంసీ అధికారులకు సూచించారు.

టీడీపీ కార్పొరేటర్ కుటుంబానికి రూ.1.20 లక్షల లబ్ధి

పార్టీలకు అతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని, అందుకు నిదర్శనమే టీడీపీకి చెందిన 98వ వార్డు కార్పొరేటర్ పి.వి.నరసింహం కుటుంబానికి కూడా సంక్షేమ ఫలాలు అందడమే అని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పేర్కొన్నారు. అడవివరంలోని కాపువీధిలో ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. 98వ వార్డు కార్పొరేటర్ పి.వి.నరసింహం స్వగృహం కూడా ఆవీధిలో ఉండడంతో ఎమ్మెల్యే వారికి అందిన లబ్ధిపై ఆరా తీశారు. "వరహా నరసింహం కుటుంబానికి లక్షా 20వేల 585రూపాయిలు, ఆయన తమ్ముడి కుటుంబానికి 29 వేలు లబ్ధి చేకూరందని తెలిపారు.

దీర్ఘకాలిక సమస్యలపై ప్రత్యేక దృష్టి

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



కోటనరవలో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్ రాజు

గోపాలపట్నం/సింహాచలం: నియోజకవర్గంలోని దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిసారించామని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ చెప్పారు. జీవీఎంసీ 88వ వార్డు కోటనరవలో బుధవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలు తీసుకెళ్లామన్నారు. అవి త్వరలోనే పరిష్కారమవుతాయని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రతీ సచివాలయానికి రూ.20 లక్షలు నిధులు వస్తాయన్నారు. వాటి ద్వారా రహదారులు, కాల్వలు బాగు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గంటెడ్డి మహాలక్ష్మి నాయుడు, దాడి సూకరాజు, మళ్ల రమణ, మళ్ల సూక అప్పారావు, శరగడం జగదీఅప్పారావు, కొయిలాడ రామసూరి, వేగి శ్రీరామ్మూర్తి, దొడ్డి రమేష్, గండ్రెడ్డి శ్రీనివాసరావు, చట్టి తాతారావు పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యమం మరింత ఉధృతం



కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జె.వి.సత్యనారాయణ

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించుకునేందుకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జె.వి.సత్యనారాయణ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే దీక్షల్లో 916వ రోజు బుధవారం సంస్థకు చెందిన ఎస్ఎంఎస్-1 విభాగ కార్మికులు, ఉక్కు నిర్వాసితులు కూర్చున్నారు. శిబిరాన్ని సందర్శించిన జేవీ సత్యనారాయణ మాట్లాడుతూ సీపీఐ, ఏఐటీయూసీ సంయుక్తంగా ఈ నెల 17వ తేదీ నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా బస్సుయాత్ర నిర్వహించి, ఉక్కు ఉద్యమంపై ప్రజలను చైతన్యపరుస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల కర్మాగారం ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరిస్తామన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వరంగంలో కొనసాగితే నిర్వాసితులకు, కార్మికులకు న్యాయం జరుగుతుందని ప్రజలకు తెలియజేస్తామన్నారు. ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో కేంద్రం తన నిర్ణయాన్ని విరమించుకోవాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని అన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

విశేషంగా అమావాస్య తిరువీధి



తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు, సిబ్బంది

సింహాచలం: అమావాస్య పురస్కరించుకుని బుధవారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి తిరువీధి వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అలంకరించి పల్లకిలో అధిష్టంపజేసి సింహగిరి మాఢ వీధుల్లో తిరువీధి ఘనంగా నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పారాయణదారులు, పండితులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

పాడిరైతులకు అండగా ప్రభుత్వం

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల
- ఉత్సాహంగా లేగదూడల ప్రదర్శన



లేగ దూడల ప్రదర్శనను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల



ప్రదర్శనలో పాల్గొన్న లేగదూడలు

సబ్బవరం: రాష్ట్ర పశుసంవర్ధక శాఖ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకుని పాడి రైతులు మరింత అభివృద్ధి సాధించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు అన్నారు. మండలంలోని రావలమ్మపాలెంలో జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన లేగదూడల ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేలైన లేగదూడల పెంపకం ద్వారా రైతులు పాడి పరిశ్రమను మరింత లాభదాయకంగా మార్చుకోవచ్చన్నారు.అందుకు పాడి రైతులకు లేగదూడల పెంపకంపై అవగాహన అవసరమన్నారు.

విజేతలు వీరే

లేగదూడల ప్రదర్శన పోటీల్లో సబ్బవరం అప్పలనాయుడుకు చెందిన లేగదూడ ప్రథమ స్థానంలో నిలిచింది. గెడ్డం సత్యనారాయణకు చెందిన లేగదూడ ద్వితీయ స్థానంలో, సబ్బవరపు అక్కునాయుడుకు చెందిన లేగదూడ తృతీయ స్థానంలో నిలిచాయి. కార్యక్రమంలో సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి. ప్రసాదరావు, జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఈవో డాక్టర్ బి. రామ్ మోహన్, సబ్బవరం ప్రాంతీయ పశువైద్య శాల సహాయ సంచాలకురాలు డాక్టర్ కె. ఉషా కుమారి, డాక్టర్ బాను బాబు,డాక్టర్ బి. సంధ్య, అంతకాపల్లి పశు వైద్యాధికారి డాక్టర్ జి. అరుణ, గుల్లేపల్లి పశు వైద్యాధికారి డాక్టర్ ఎస్. సౌజన్య,ఉప సర్పంచ్ గొర్లి అప్పారావు,మాజీ సర్పంచ్ సబ్బవరపు దేముడు బాబు తదితరులు పాల్గొన్నారు.

19న గొరపల్లి నాలుగో వార్డుకు ఉప ఎన్నిక



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో వసంత

సింహాచలం: గొరపల్లి పంచాయతీ పరిధిలో ఈనెల 19న నిర్వహించనున్న నాలుగో వార్డు ఉప ఎన్నికకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఎంపీడీవో వసంత తెలిపారు. పోలింగ్ జరిగే ఎంపీపీ పాఠశాలను ఆమె బుధవారం పరిశీలించారు. ఇప్పటికే నామినేషన్ల స్క్రూటీనీ పూర్తయిందని చెప్పారు. మొత్తం 244మంది ఓటర్లు ఉన్నారని, వారిలో పురుషులు 116 మంది, మహిళల ఓట్లు 128 ఉన్నాయన్నారు. ప్రతీ ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. కాగా పెందుర్తి మండలంలోని గొర్లపల్లి పంచాయతీ వార్డు నెంబర్- 4మెంబర్‌గా ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎస్.అప్పారావు మృతి చెందడంతో ఉప ఎన్నిక జరగనుంది. అప్పారావు భార్య ఎస్.దేవుడమ్మ వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీలోఉన్నారు. అలాగే టీడీపీ మద్దతుతో వనం చిన్నా పోటీలో ఉన్నారు. అలాగే మండలంలోని ఎస్ఆర్‌పురం పంచాయతీ 9వ వార్డుకు కూడా ఉప ఎన్నిక జరగాల్సి ఉండగా ఎవరూ నామినేషన్లు దాఖలు చేయలేదు.

శిష్టకరణ సంఘం అసోసియేట్ అధ్యక్షుడిగా దొంకాడ

డాబాగార్డెన్స్: ఆంధ్రప్రదేశ్ శిష్టకరణ సంఘం అసోసియేట్ అధ్యక్షుడిగా దొంకాడ అనిల్‌కుమార్ నియమితులయ్యారు.ఈ సందర్భంగా ఆయనకు రాష్ట్ర శిష్టకరణ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కె.అనూషా పట్నాయక్, అఖిల భారత శిష్టకరణ సంఘం అధ్యక్షుడు కె.వేంకటేశ్వర బెనర్జీ, రాష్ట్ర శిష్టకరణ సంఘం గౌరవ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు మంత్రి రాజశేఖర్, గౌరవ సలహాదారుడు కె.నాగేశ్వరరావు, మహిళా అధ్యక్షురాలు డబ్బీరు ప్రశాంతి పట్నాయక్, ఆర్గనైజింగ్ కార్యదర్శి జయతి ఉమామహేశ్వరరావు, మంత్రి నరసింహమూర్తి అభినందనలు తెలిపారు.

రేపటి నుంచి శ్రావణ మాస పూజలు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో ఈ నెల 18వ తేదీ నుంచి సెప్టెంబర్ 15వ తేదీ వరకు నిజ శ్రావణ మాస విశేష పూజలు నిర్వహించనున్నట్లు దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు.

ఏఎంసీ విద్యార్థుల ప్రతిభ



విజేతలతో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు

మహారాణిపేట: మంగళగిరిలోని ఎయిమ్స్‌లో 5వ కొలొక్వియంలో భాగంగా నిర్వహించిన ఆలిండియా అంతర్ కళాశాలల పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఆంధ్ర మెడికల్ కళాశాల విద్యార్థులను ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు అభినందించారు. ఈ పోటీల్లో ఏఎంసీ నుంచి మొదటి సంవత్సరం విద్యార్థులు 12మంది పాల్గొనగా అనాటమీ మోడల్‌లో డి.సాయి వైష్ణవి బంగారు పతకం, అనాటమీలో డి.వి.రంగనాథ్ రజతం, జి.రోష్ని కాంస్య పతకాలు గెలుచుకున్నారు. కళాశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో విజేతలను ప్రిన్సిపాల్ అభినందించారు. కార్యక్రమంలో ఏఎంసీ అనాటమీ విభాగాధిపతి డాక్టర్ ఎస్.రవీంద్ర కిషోర్, ఫిజియాలజీ విభాగాధిపతి డాక్టర్ పద్మ గీతాంజలి, బయోకెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ వి.భవాని తదితరులు పాల్గొన్నారు.

వైవీ సుబ్బారెడ్డికి ఘన స్వాగతం



వైవీ సుబ్బారెడ్డిని సబ్బవరంలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో సత్కరిస్తున్న పార్టీ నేతలు

సబ్బవరం: సబ్బవరంలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డికి స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం ఘన స్వాగతం పలికారు. విశాఖపట్నం నుంచి పాడేరు పర్యటనకు వెళ్తున్న ఆయనకు స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమీపంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి తదితరులు ఘనంగా సత్కరించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సుబ్బారెడ్డిని కోరారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 2009లో ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని వివరించారు. ఈ ప్రాజెక్టు పరిస్థితిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లి త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.దీనిపై సానుకూలంగా స్పందించిన సుబ్బారెడ్డి విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. ఆయనకు స్వాగతం పలికినవారిలో వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కొటాన రాము, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, పార్టీ మండల కన్వీనర్ కర్రిబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు కాపుశెట్టి శేషుబాబు, ఉపాధ్యక్షుడు పల్ల కృష్ణ, సీనియర్ నాయకులు బోకం రామునాయుడు,మోపాడ అప్పారావు,సబ్బవరపు నాగభూషణం,సబ్బవరపు సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- ఎన్టీపీసీ జీజీఎం సిన్హా



దీపాంజలినగర్ టౌన్‌షిప్‌లో మొక్కలు నాటుతున్న జీజీఎం ఎస్.కె.సిన్హా

పరవాడ: నా మట్టి-నా దేశం కార్యక్రమంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని సింహాద్రి ఎన్టీపీసీ జీజీఎం అజయ్ కుమార్ సిన్హా పిలుపునిచ్చారు. దీపాంజలినగర్ టౌన్‌షిప్‌లో నామట్టి-నాదేశం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని జీజీఎం సిన్హా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం విరివిగా మొక్కలు నాటాలని కోరారు. నామట్టి- నాదేశం కార్యక్రమంలో భాగంగా పరవాడ, ముత్యాలమ్మపాలెం, నాయుడుపాలెం, కలపాక, వాడచీపురుపల్లి, వెన్నలపాలెం, తిక్కవానిపాలెం, రావాడ గ్రామ పంచాయతీల్లో మొక్కలు నాటడానికి చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో దీపిక లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు అంజూ సిన్హా, సీజీఎం గోవిందరాజన్, సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండర్ ప్రభాకర్, సీఎస్సార్ ఉన్నతాధికారి ప్రకాశరావు, సంస్థ అధికారులు పాల్గొన్నారు.

వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలి

- డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు



మొబైల్‌లో యాప్‌లను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

మహారాణిపేట: గర్భిణుల వివరాలతో పాటు వ్యాక్సినేషన్ వంటి అంశాల ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు సూచించారు. పెందుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో బుధవారం సందర్శించారు. పలు ఆరోగ్య కార్యక్రమాలపై సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అనంతరం వారి మొబైల్ యాప్‌ల ద్వారా నమోదు చేస్తున్న వివరాలను పరిశీలించారు. సర్వేలు ఎంత వరకూ వచ్చిందో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. జెర్రిపోతుల పాలెం విలేజ్ హెల్త్ సెంటర్‌ను కూడా సందర్శించారు.ఆయన వెంట నోడల్ అధికారి డాక్టర్ ఎస్.రమారెడ్డి, మహిళా ఆరోగ్య అధికారి డాక్టర్ ఉమావతి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



అప్పన్న నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



వెంకన్న కల్యాణ ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్య కల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

వెంకటాద్రిపై..

వెంకటాద్రిపై బుధవారం వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. చాతుర్మాస పూజల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీదేవి,భూదేవి సమేతంగా వెంకన్న ఉత్సవమూర్తులను వేదికపై అధిష్టంపజేసి కల్యాణం వేడుకగా నిర్వహించారు. భక్తులకు స్వామివారి ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రామానుజమ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

సింహగిరిపై ఇంజినీరింగ్ అధికారుల పర్యటన

- పలు నిర్మాణాలకు అనువైన ప్రదేశాల గుర్తింపు



సింహగిరిపై చర్చిస్తున్న ఏయూ విశ్రాంత ప్రధాన ఇంజినీర్ మాధవ్, దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులు

సింహాచలం: సింహగిరిపై పలు నిర్మాణాలు చేపట్టేందుకు అనువైన ప్రదేశాలను గుర్తించడానికి బుధవారం ఏయూ విశ్రాంత ప్రధాన ఇంజినీర్ డాక్టర్ జి.మాధవ్, దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు పర్యటించారు. సుమారు రూ.4 కోట్లతో కార్ల పార్కింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి సంబంధించి గజపతి కాటేజీ వెనుక వైపు ఉన్న స్థలాన్ని పరిశీలించారు. అలాగే ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ నిర్మాణం, అన్నప్రసాద సత్రంపై ప్రసాదాల తయారీకి అదనపు అంతస్తు నిర్మాణం తదితర ప్రణాళికపై చర్చించారు. దేవస్థానం ఈఈ శ్రీనివాస రాజు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు సంపంగి శ్రీనివాసరావు, వారణాసి దినేష్‌రాజ్ పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసీదళార్చన నిర్వహించనున్నారు. భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806091లో రుసుం చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు ట్రాన్సాక్షన్ వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబర్‌ను 89855 15989కు వాట్సాప్ చేయాలి.